



హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల

- వివాదాస్పదమవుతున్న ప్రభుత్వ నిర్ణయం
- అభ్యంతరం తెలుపుతున్న విద్యార్థి సంఘాలు
- యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్
- ఆందోళనలకు సిద్ధం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కళాశాలను యూనివర్సిటీ కేంద్రంగా కాకుండా హుస్నాబాద్‌లో నెలకొల్పడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల పెద్దపల్లిలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాతవాహన యూనివర్సిటీకి ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలను, లా కళాశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

యూనివర్సిటీలో అనుకూలతలు

జిల్లాలో ప్రస్తుతమున్న ఇంజనీరింగ్ కళాశాలలన్నీ ప్రైవేట్ యాజమాన్యంలోనే నడుస్తున్నాయి. శాతవాహన యూనివర్సిటీకి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని విద్యార్థి సంఘాలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం జారీ అయిన ఉత్తర్వుల్లో ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలో కాకుండా హుస్నాబాద్‌లో నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలోనే ఉన్నా ఆ నియోజకవర్గం ముఖ్యంగా, మండల కేంద్రం సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ నియోజకవర్గంలో (మిగతా 8వ పేజీలో)

అధికారముందని తరలిస్తే చూస్తూ ఊరుకోం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్ టౌన్: శాతవాహన యూనివర్సిటీకి మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను ఇక్కడే ఏర్పాటు చేయాలి. అధికారముందికదా అని సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌కు తరలిస్తే చూస్తూ ఊర్కొనేది లేదు. లా కళాశాల ఇక్కడ, ఇంజనీరింగ్ కళాశాల హుస్నాబాద్‌లో ఎలా ఏర్పాటు చేస్తారు. దీన్ని జిల్లా ప్రజలెవరూ హర్షించరు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా దీనిని వ్యతిరేకించి కరీంనగర్‌లో కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలి. లేకుంటే ప్రజల్లో దోషులుగా నిలుస్తారు. విద్యార్థి సంఘాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. కరీంనగర్‌లో ఇంజనీరింగ్ కళాశాల కోసం పోరాటం చేస్తాం.. న్యాయస్థానాన్ని అయినా ఆశ్రయించి ఇక్కడే కళాశాల ఏర్పటయ్యేలా చూస్తాం.

ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌లో ఏర్పాటు చేయడం శోచనీయం



- మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

శాతవాహన యూనివర్సిటీకి మంజూరు చేసిన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఏర్పాటు చేయడం శోచనీయం. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అనువుగా ఉంటుంది. ఇంజనీరింగ్ కళాశాలతరలింపు విషయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ అభివృద్ధికి వ్యతిరేకమైన ఇలాంటి కార్యక్రమాలను మానుకోవాలి.

విద్యార్థులకు, యువతకు మంత్రి పొన్నం సమాధానం చెప్పాలి..



- బామండ్లపల్లి యుగేందర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌కు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలించుకుపోయారు. జిల్లాలోని విద్యార్థులకు, యువతకు మంత్రి సమాధానం చెప్పాలి. కరీంనగర్ జిల్లా ప్రజలకు, విద్యార్థి, యువతకు బేషరతుగా మంత్రి క్షమాపణ చెప్పాలి. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకొని, ఇంజనీరింగ్ కళాశాలను కరీంనగర్‌లోనే ఏర్పాటు చేయాలి.

హుస్నాబాద్‌కు తరలించడం సరికాదు



- కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి

జిల్లాకు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలించడం సరికాదు. శాతవాహన యూనివర్సిటీకి అనుబంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మిస్తే ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. తన వ్యక్తిగత రాజకీయ స్వార్థం కోసం ఇంజనీరింగ్ కళాశాలను కరీంనగర్‌లో కాకుండా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నెలకొల్పటం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలను కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

శాతవాహన యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలి



- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఏఐఎస్ఎఫ్ డిమాండ్ ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్, లా కళాశాల మంజూరు చేసింది. ఇంజనీరింగ్ కళాశాలను శాతవాహన యూనివర్సిటీనే ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఏర్పాటు చేస్తేనే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలి.

విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిన రాష్ట్ర ప్రభుత్వం



- కాంపెల్లి అరవింద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

హుస్నాబాద్ నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కళాశాల తరలించి జిల్లా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి



- నర్సింగోజు శ్రీనివాస్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు

శాతవాహన యూనివర్సిటీలోనే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసి జిల్లా విద్యార్థులకు అన్యాయం చేయొద్దు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

హుజూరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయంలో డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సరైన పద్ధతిలో నిర్వహించాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరుచూ సందర్శిస్తూ వారి పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఏసీపీలు డివిజన్ స్థాయిలో ప్రతి నెలా నేర సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి త్వరగా పరిష్కరించాలన్నారు. ఆకస్మాత్తుగా తలెత్తే శాంతి భద్రతల



హుజూరాబాద్‌లో పోలీసుల వాహనాలను తనిఖీ చేస్తున్న సీపీ గౌస్ ఆలం

సమస్యలను పరిష్కరించేందుకు లాఠీ, హెల్మెట్ లాంటి పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులు పోలీస్ స్టేషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో పొందు పరచాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారం సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. గంజాయిని నిర్మూలించేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా పాఠశాల, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తుతో పాటు తగిన భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐలు పులి వెంకట్, రవి, కిశోర్, సీసీఆర్బీ సంతోష్‌కుమార్, సైబర్ సెల్ రమేష్, ఐటీ కోర్ సరిలాల్, ఎస్ఐలు తిరుపతి, రవి, రాజకుమార్ పాల్గొన్నారు.

'శాతవాహన' పరిధిలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు 7

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- మొండి బకాయిదారులపై కమిషనర్ కొరడా
- రెడ్ నోటీసుల జారీ... ఆస్తుల జప్తు ముమ్మరం
- పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పిలుపు



ఇంటియజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు రావలసిన ఆస్తి పన్నుల వసూళ్లపై కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేక దృష్టి సారించారు. కోట్లలో పెండింగ్‌లో ఉన్న మొండి బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో మార్చి మొదటి వారం వరకు 50 శాతంలోపు మాత్రమే పన్నులు వసూలయ్యాయి. నెలాఖరులోగా వందశాతం వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మొండి బకాయిలన్నింటిని వసూలు చేయాలని వార్డు ఆఫీసర్లకు, రెవెన్యూ సిబ్బందికి టార్గెట్ ఇచ్చి ప్రతిరోజు వారితో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 70 శాతం మేరకు వసూలు చేసినట్లు తెలిసింది. నాలుగురోజులుగా వార్డు ఆఫీసర్లను, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను వెంటబెట్టుకుని డివిజన్లలో పర్యటిస్తున్నారు. ఏళ్లతరబడి ఆస్తిపన్నులను చెల్లించని బకాయిదారుల వద్దకు వెళ్లి వారంరోజుల వ్యవధితో రెడ్ నోటీసులను జారీ చేస్తున్నారు. గడువు ముగిసిన వెంటనే ఆయా ఇళ్లకు సంబంధించిన నల్లాల కనెక్షన్లను తొలగించడం, ఆస్తులను జప్తు చేయించడం వంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. మూతపడిన థియేటర్లు, వాణిజ్య సంస్థలు, కమర్షియల్ కాంప్లెక్సులు, వివిధ ప్రభుత్వశాఖల బకాయిలన్నింటిని వసూలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. వడ్డీ భారం పడకుండా మార్చి 31లోగా ఆస్తిపన్నులు చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం ఆమె నగరంలోని పలు డివిజన్లలో రెవెన్యూ అధికారులు, వార్డు ఆఫీసర్లతో కలిసి మొండి బకాయిదారుల ఆస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నగర పాలక సంస్థకు ఆస్తిపన్నులను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఇంటియజమానులకు విజ్ఞప్తి చేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను బకాయిలను వసూలు చేయించారు. కొందరికి బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేయించి గడువులోగా చెల్లించకుంటే ఆస్తులను సీజ్ చేస్తామని, నల్లాలను తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ సమావేశ మందిరంలో ఆస్తిపన్నువసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్నులు చెల్లించేందుకు ఆరు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, ఈలోగా ఆస్తిపన్నులు వసూలయ్యేలా చూడాలని ఆదేశించారు. గడువులోగా మీలక్ష్యాన్ని పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పన్నుల వసూళ్లలో వేగం పెంచాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గోనె సంచులు, టార్పాలిన్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. మరో 15 ప్యాడీ క్లీనర్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలకు వేర్వేరు ప్రాంతాలు కేటాయించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆకాంక్షలు నెరవేర్చకుంటే నిరసన తప్పదు

సుభాష్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల సాధనకు తక్షణం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా ఛైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో మంగళవారం



ఎన్నికైన జేఏసీ కార్యవర్గం

నిర్వహించిన సమావేశంలో జేఏసీ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య ఉద్యమం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడికి తక్షణ కార్యాచరణ ప్రారంభించాలని, హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆర్థిక పరమైన, ఇతర అంశాలపై రాష్ట్ర జేఏసీ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందచేసినట్లు తెలిపారు. సంవత్సర కాలంగా ఎంతో ఓపికతో ఎదురుచూశామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే తీవ్రమైన నిరసన, ఉద్యమ తీవ్రతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జేఏసీ కార్యవర్గం...

తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా దారం శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్‌గా మడిపెల్లి కాళీచరణ్, కో ఛైర్మన్లుగా ఐలేని కరుణాకర్‌రెడ్డి, కట్ట రవీంద్రచారి, తూముల తిరుపతిరెడ్డి, పెద్ది విజయ్, ముల్కల కుమార్, శశిధర్‌శర్మ, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కోట రామస్వామి, మోసం అంజయ్య, పెండ్యాల కేశవరెడ్డి, ఖాజా మన్సూర్‌అలీ, వంగ వెంకటేశ్వర్లు, పరశురాములు ఎన్నియ్యారు. కోశాధికారిగా సంగెం లక్ష్మణరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి, డాక్టర్ అరవింద్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, వెంకన్న, రాజశేఖర్‌రెడ్డి, అభినవ్, సురేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, అజయ్, గజన్‌లాల్, గురుప్రసాద్, నారాయణరెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, పులి నగేశ్, మహిళ విభాగం చైర్‌పర్సన్‌గా శారద, సెక్రెటరీ జనరల్‌గా ఎం వీణ, బాధ్యులుగా సునీత, విజయలక్ష్మి, స్వరూప, భాగ్యలక్ష్మి, భూపేందర్‌కౌర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహస్వామి, కిరణ్‌కుమార్, రాజేశ్‌భరద్వాజ్, హర్మిందర్‌సింగ్, సుమంత్‌రావు, నారాయణ, కరుణాకర్, నరసయ్యతో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతుల రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉందన్నారు. చాలా గ్రామాల్లో రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. జమిలి ఎన్నికల విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయన్నారు. దీని వల్ల ప్రజాధనాన్ని వృథా కాకుండా కాపాడుకోవచ్చన్నారు. ప్రజలకు మేలు చేసే ఏ విషయాన్నైనా కాంగ్రెస్ వ్యతిరేకించడం అలవాటుగా మార్చుకుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జాతీయ నాయకత్వ బాటలోనే నడుస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి వారి జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, నాయకులు సబ్బని రమేష్, బొరగాల సారయ్య, గంగిశెట్టి ప్రభాకర్, రావుల వేణు, అంకటి వాసు, యాంసాని శశిధర్, యాళ్ల సంజీవరెడ్డి, కొలిపాక శ్రీనివాస్, గంట సంపత్, వెంకటేష్, నాగరాజు, రాజు, భాస్కర్, హృతిక్, రవీందర్, దేవేంద్ర, మాధవి, అపర్ణ, అజయ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు. కొమురయ్య అనే వ్యక్తి లబ్ధిదారుల వద్ద నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అతని వద్ద నుంచి క్వింటాల్న్నర బియ్యాన్ని స్వాధీనం చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ మోటార్ అపహరణ

చందుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఎర్రవెల్లి రాజు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో నుంచి మోటర్, పైపులను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించారు. గ్రామస్థుల కథనం ప్రకారం రోజు మాదిరిగానే రాజు ఉదయం పొలం వద్దకు వెళ్లేసరికి బావిలోని మోటర్, పైపులు కనిపించలేదు. మోటార్ విలువ దాదాపు రూ. 40 వేల పైగా ఉంటుందని తెలిపారు.

కాపర్ వైర్ల చోరీ

గంగాధర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని చర్లపల్లి(ఆర్)లో వ్యవసాయ విద్యుత్ మోటర్ల కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని వరద కాలువకు సుమారుగా రెండు కిలోమీటర్ల మేర వ్యవసాయ మోటర్లతో రైతులు పొలాలకు సాగునీరందిస్తుంటారు. అయితే రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటర్లకు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ కాపర్వైర్లను దొంగిలిస్తున్నారని రైతులు వాపోయారు. పోలీసులు స్పందించి తమ మోటర్ల వైర్లను దొంగిలించిన వారిని గుర్తించి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయడం లేదు'

కరీంనగర్ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని విజయ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తన పేరిట ఉన్న గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయకుండా ఇతరులకు అమ్ముకుంటున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భగత్‌నగర్‌కు చెందిన వొడ్నాల వెంకటశ్రీనివాసరావు మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పేరిట ఉన్న గ్యాస్‌సిలిండర్ ఖాతా నంబరుతో ప్రతి నెలా ఓ యాప్ ద్వారా సిలిండర్‌ను బుక్ చేసుకుంటూ బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని బాధితుడు ఆరోపించారు. దీనిపై పోలీసులకు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన పేరిట గ్యాస్‌సిలిండర్ బుక్ చేసి బ్లాక్‌లో అమ్ముకుంటున్న గ్యాస్ ఏజెన్సీ డీలర్‌షిప్‌ను రద్దుచేసి, తనకు పరిహారం ఇప్పించాలని కోరారు. వీనిపై వినియోగదారుల ఫోరంనకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నడకతో సమూహమై... సమాజ హితమై

● అభాగ్యులకు అండగా ఖని వాకర్స్ ● రూ. పదిలక్షలకు పైగా బాధితులకు అందజేత

కోల్‌సిటీటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం మొదలైన నడక అందరి సహకారంతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేలా చేసింది. ఐదారు గురుతో మొదలైన ఈ నడక రోజురోజుకు సభ్యుల సంఖ్య పెరుగుతూ వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. వాట్సాప్‌లో సమాచారాన్ని అందిస్తూ ఎంతో కొంత డబ్బు జమ చేసి ఆపదలో ఉన్న వారికి అందజేస్తున్నారు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.

గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వాకింగ్ కోసం వచ్చిన వారు స్నేహితులై సమాజ హితం కోసం 2019 సంవత్సరంలో ఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఏర్పడింది. అలా మొదలైన ఈ వాకర్స్ అసోసి యేషన్ సేవలు నేటికి కొనసాగుతున్నాయి. మిత్రులకు, అభాగ్యులకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలుస్తోంది. గోదావరిఖని ప్రాంతంలోని అన్ని వర్గాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ఈ అసోసియేషన్‌లో ఉన్నారు. రోజు వాకింగ్ కోసం మైదానానికి వచ్చే వారిలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, పోలీసులు, సింగరేణి కార్మికులు, క్రీడాకారులు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాసరి రఘు అసోసియేషన్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సమష్టిగా ముందుకు వెళుతున్నారు. ఆపదలో ఉన్న విషయం తెలియగానే వెంటనే వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేసి సభ్యులకు సమాచారం ఇస్తున్నాడు. దీంతో సభ్యులందరూ స్పందించి తేచిన సాయాన్ని జమ చేసి బాధితులకు అందజేస్తున్నారు. ఇలా ఐదారేళ్ళుగా సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. స్టేడియం బాయ్ ఇంతియాజ్ కూతురు వివాహానికి రూ.లక్ష, నిరుపేద కూలి బాపు కుటుంబానికి రూ.1.30వేలు, భరత్ కుటుంబానికి రూ. 1,83 వేలు, నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. ఇలా ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు సాయం చేశారు.


స్టేడియం బాయ్ కూతురు వివాహానికి ఆర్థికసాయం అందిస్తున్న వాకర్స్ (ఫైల్)

సేవ చేయడంలో తృప్తి...



ఆరోగ్యం కోసం మొదలైన నడక ఇలా సేవకు మార్గం వేసింది. ఇందుకు అందరి సహకారం తోడైంది. మానవతా దృక్పథంతో ముందుకు వస్తూ తేచిన సహాయం అందిస్తున్నారు. వాటిని జమ చేసి అందరి సమక్షంలో ఇస్తున్నాం. ఇలా సేవ చేయడం చాలా తృప్తిగా ఉంది.

దాసరి రఘు, వాకర్స్ అసోసియేన్ కన్వీనర్

ఆరోగ్యం కోసం వెళితే ఆప్తులు...



ఆరోగ్యం కోసం మైదానం కోసం వెళితే ఆప్తులు దొరికారు. సేవా దృక్పథం కలిగిన స్నేహితులతో కలిసి తాను కూడా భాగస్వామినై తేచిన సాయం అందించడంలో తృప్తి ఉంది. రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేయడంలో ముందుంటాను.

చెన్నూరి వేణు, వ్యాపారి

సాయం చేయడంలో తృప్తి



ఆరోగ్యం కోసం పాతికేళ్ళుగా వాకింగ్ చేస్తున్నాను. చాలా మంది మిత్రులను మైదానం కలిపింది. అలా మైదానంలోని స్నేహితులందరం సమాజ హితం కోసం సేవ కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో నేను భాగస్వామిని కావడం తృప్తిగా ఉంది.

దీటి శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఈతకు వెళ్లి బాలుడి గల్లంతు


నరేష్(ఫైల్)

గొల్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాము నిపల్లెలో రిజర్వాయర్‌లోకి ఈతకు వెళ్లిన విద్యార్థి నరేష్ (12) చెరువు లో పడి మంగళవారం గల్లంతయ్యాడు. రంగదామునిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటి పూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రంగదామునిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరో చోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు.

ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడం తో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రిజర్వాయర్ వద్దకు వచ్చి స్థానిక జాలర్లతో బాలుడి కోసం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


విష్ణు (ఫైల్)

తంగళ్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మోగిలోజు విష్ణు(44) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం.. విష్ణు కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతుండగా కుమారుడికి రేచీకటి వ్యాధి, కూతురు మానసిక ఎదుగుదల లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పక్షవాతంతో పనిచేసే పరిస్థితి లేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కవిత, కూతు రు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై యువకుడి అత్యాచారం

సైదాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఓ గ్రామంలో 70 ఏళ్ల వృద్ధురాలిపై కరీంనగర్ పట్టణానికి చెందిన షేక్ ముక్తార్ (33) అనే యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ముక్తక్ ఖురేషి ఓ చికెన్ సెంటర్‌లో పనిచేసేందుకు తన కుటుంబంతో సహా కరీంనగర్ నుంచి ఎనిమిది నెలల క్రితం సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి వచ్చాడు. మూడు నెలలు చికెన్ సెంటర్‌లో పనిచేసిన తర్వాత అతని ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో యజమాని పనిలో నుంచి తొలగించాడు. అప్పటి నుంచి షేక్ ముక్తార్ అదే గ్రామంలో సొంతంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కొన్నిరోజుల క్రితం తన స్వస్థలమైన కరీంనగర్‌కు కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 10గంటల ప్రాంతంలో గ్రామానికి వచ్చి వృద్ధురాలిపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి కరీంనగర్‌కు వెళ్లిపోయాడు. బాధితురాలు సోమవారం తనపై షేక్ ముక్తార్ అత్యాచారం చేశారని సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయుడికి బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్ట్ అవార్డు


అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు

గంభీరావుపేట మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజసింగవరం ప్రభుత్వ పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు అక్కపెల్లి యాదగిరిగౌడ్ బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్టుగా అవార్డు అందుకున్నాడు. ఉగాది పండగ పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డును ప్రముఖ సినిమానటులు ఆర్ఎస్ నంద, సీతామాలక్ష్మి చేతుల మీదుగా ఉపాధ్యాయుడు యాదగిరిగౌడ్ అందుకున్నాడు. ఈ సందర్భంగా కళాకారులు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు యాదగిరి గౌడ్‌ను అభినందించారు.

రూ.7,240 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,240 రూపాయలు పలికింది. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 165 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర 7,240 రూపాయలు, కనిష్ఠ ధర .5700 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు

ధైటింక్లయిన్‌కాలనీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాలనీలోని హనుమాన్‌నగర్‌లో నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నాటుసారా విక్రయాలు జరుపుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు లావుడ్య రాజేశ్వరి ఇంటిలో సోదాలు నిర్వహించగా, 5 లీటర్ల నాటుసారా పట్టుబడినట్టు ఎస్సై తెలిపారు. నాటుసారా స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో చోరీ

జ్యోతినగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి నగదు, బంగారు, వెండి నగలు అపహరించారు. ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి పర్మినెంట్ టౌన్‌షిప్ లోని సీ-8/3 క్వార్టర్‌లో టీవీఆర్ చంద్ర, మరో ఇద్దరు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15వ తేదీన చంద్ర బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. అలాగే పక్కనే ఉన్న మరొక ఉద్యోగి ఇంట్లో అర కిలో వెండి నగలను అపహరించారు. మరొకరి ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఎలాంటి సొత్తు అపహరణకు గురి కాలేదు. దీంతో ఎన్‌టీపీసీ పోలీసులకు బాధితుడు చంద్ర సమాచారం అందించాడు. చంద్ర ఇంట్లో సుమారు రూ.15వేల రూపాయల విలువైన నగదు బంగారం, శ్రీనివాసరావు అనే ఉద్యోగి ఇంట్లో అరకిలో వెండి నగలు చోరీకి గురయ్యాయి.

పెద్దపల్లిలోని బంగారం షాపులో..

పెద్దపల్లి టౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి పైడ బజారులోని దేవరకొండ కరుణాకర్‌కు చెందిన బంగారు షాపులో చోరీ జరిగింది. 10 తులాల బంగారం, నాలుగు వేల రూపాయల నగదు దోచుకెళ్లారు. కరుణాకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై మల్లేష్ కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించగా మహిళగా గుర్తించి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ధర్మారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నర్సింగాపూర్, ఖిలావనపర్తి, ధర్మారం గ్రామాల్లోని వందల ఎకరాల ప్రభుత్వ అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితం నర్సింగాపూర్ సర్వే నంబర్ 273లో జరుగుతున్న భూ ఆక్రమాలను తహసీల్దార్ ఎండీ వకీల్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి భూ ఆక్రమదారులకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ధర్మారంలోని సర్వే నంబర్ 476తో పాటు ఖిలావనపర్తిలోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మానవహక్కులపై విద్యార్థులకు అవగాహన

ఇబ్రహీంపట్నం,మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మానవ హక్కులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల హెల్ప్ అసో సియేషన్ చైర్మన్ ఎండీ షలీం మాట్లాడుతూ రాజ్యాంగం మానవులు స్వేచ్ఛగా బతకడానికి ఎన్నో హక్కులను అందించిందన్నారు. ప్రతీ ఒక్కరు మనవ హక్కుల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పరాంకుశం నర్సయ్య, ఎండీ షాబీర్, హుస్సేన్, గంగాధర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఈ-ఆటో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ ఆటో(ఈ-ఆటో) డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ హైదారాబాద్ ఆధ్వర్యంలో నడుస్తున్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదారాబాద్‌లోని మోవో సోషల్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈ-ఆటో డ్రైవింగ్ ఉచిత శిక్షణను మహిళా ఇన్‌స్ట్రక్టర్స్ ద్వారా ఇవ్వనున్నట్లు వివరించారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు 50 మంది నిరుపేద గ్రామీణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళాలకు 45 నుంచి 60 రోజుల పాటు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఇప్పించేందుకు, మహిళలు ఈ-ఆటో కొనుగోలు చేసేందుకు రుణాలు లభించే విధంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అసక్తిగల మహిళలు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎల్ఎండీలోని మహిళా ప్రాంగణ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 9347114396, 9849787823 నంబర్లకు సంప్రదించాలని సుధారాణి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం శివారులోని అటవీ ప్రాంతం నుండి జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కులరావుపేటకు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు అటవీ శాఖ డిప్యూటీ రెంజ్ అధికారి రాఘవేంద్రరావు మంగళవారం తెలిపారు. అటవీ ప్రాంతంలో నుంచి విలువైన టేకు కలప తరలి వెళ్లుతుందన్న పక్కా సమాచారంతో అక్రమ టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్ను మోత్కులరావుపేట శివారు అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకుని, చందుర్తికి తరలించామన్నారు. అక్రమ కలపను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, అనిత, అటవీ శాఖ సిబ్బంది తిరుపతి, శంకర్‌లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 25,869 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు. పేకాట ఆడే వ్యక్తుల పై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ


పెద్దపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

పెద్దపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని, కూనారం రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం జిల్లాకు వచ్చిన సందర్భంగా సీపీఎం నాయకులు ఆయనకు చీకురాయి రోడ్డు వద్ద స్వాగతం పలికి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యల పై సర్వే చేస్తున్నామని, అనంతరం సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఒక బస్సు ప్రయాణం తప్ప మిగతావి అమలు జరగలేదన్నారు. గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, రాష్ట్ర నాయకులు బిక్షమయ్య, కోట రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు, జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, జి జ్యోతి, మండల కమిటీ సభ్యులు మోదంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, సీపెల్లి దిలీప్, నవీన్, వెంకటస్వామి, ఖాజా, రాజమల్లు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు కేసీఆర్ గతే..

కోల్‌సిటీ: బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారంతో నిర్బంధ పాలన చేశాడని, అతన్ని ప్రజలు ఇంటికి పంపారని, అదే విధానాన్ని కొనసాగిస్తే రేవంత్‌కు అదే గతి పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ప్రసంగించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నారని, సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసాను పూర్తి చేయడం లేదన్నారు. ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సేవకులకు వేతనాలు పెంచడం లేదన్నారు. అనంతరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకురాలు మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, బిక్షమయ్య, జిల్లా కార్యదర్శి యాకయ్య, నాయకులు ముత్యం రావు, రామాచారి, వేల్పుల కుమారస్వామి, సారయ్య, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై రామగుండంకు వచ్చిన జాన్‌వెస్లీకి

'గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిన పండ్లు, కూరగాయలు'

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిన పండ్లు కూరగాయలు ఇస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం నగరంలోని రాంనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో కుళ్లిన పండ్లను సరఫరా చేస్తూ, నాణ్యతలేని కూరగాయలను పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో నరేష్‌పటేల్, ప్రకాశ్, రాము, లక్పతి నవీన్, రాము నరేష్, రాజేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.


కుళ్లిన పండ్లను చూపిస్తున్న నాయకులు

పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

తంగళ్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు అప్పులు, మరో వైపు ఉపాధి లేక పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇందిరమ్మకాలనీ గ్రామానికి చెందిన పవర్‌లూం కార్మికుడు పరికిపెల్లి రాజు(65) సోమవారం రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మంగళవారం మృతిచెందాడు. రాజుకు భార్య పద్మ, కొడుకు రాకేశ్, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. రాజు మరమగ్గాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల, కొడుకుకు వివాహం జరిపించగా సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పులు అయ్యాయి. కొద్ది రోజులుగా పనిలేక ఇబ్బందులు పడుతూ మద్యానికి బానిసయ్యాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై బాత్‌రూం క్లీన్ చేసే యాసిడ్ తాగాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **కుటుంబాన్ని ఆదుకోవాలి..**

ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న రాజు కుటుంబానికి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. రాజు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కార్మికుల ఆత్మహత్యలు నివారించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు నెలకు 26వేల రూపాయల వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన 2023 యారన్ సబ్సిడీ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

జగిత్యాలరూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎస్‌కెఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు జ్ఞానసముపార్జనే కాకుండా, వినియోగ విశ్లేషణ కార్యక్రమాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇకముందుకూడా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాసవి, వరప్రసాద్, సంగీతరాణి, సుజాత, శ్రీలత,, నీరజ, జమున, సుస్మిత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్రం అవార్డులు



ప్రగతి చక్రం అవార్డులను అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మంగళవారం అధికారులు ప్రగతిచక్రం అవార్డులు ప్రదానం చేశారు. అంబేడ్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎం బి రాజు అవార్డులు అందించారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలకు చెందిన 56 మంది ఉద్యోగలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి వెంకటేశ్వర్‌రావు, ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ ఆర్ఎం

కరీంనగర్ రీజియన్ రీజినల్ మేనేజర్ బి రాజును బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి వెంకటేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

శాతవాహన పరిధిలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కరీంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 18,19లను సోమవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్‌లో లా కళాశాల ఏర్పాటు కు పచ్చ జెండా ఊపింది. ఈ రెండు కళాశాలలు రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి. హుస్నాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో బీటెక్ సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచ్‌లు ప్రారంభించనున్నారు. ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.44.12 కోట్లు కేటాయించగా అందులో రూ.29.12 కోట్లు ప్రస్తుతం మంజూరు చేశారు. మిగతా రూ.15 కోట్లను తర్వాత మంజూరు చేయనున్నారు. శాతావాహన వర్సిటీలో ఏర్పాటు చేయనున్న లా మూడేళ్ల కోర్సు, రెండేళ్ల కోర్సులో అడ్మిషన్లు ఇవ్వబోతున్నారు. ఈ కళాశాల నిర్మాణానికి మొత్తం రూ.22.96 కోట్లు కేటాయించారు. అందులో ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ.67.08 కోట్లను ప్రభుత్వం రెండు కళాశాలలకు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై శాతవాహన వీసీ ఉమేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఎమ్మెల్యేలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రాములోరి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించాలి

అధికారుల సమావేశంలో ఆర్డీవో రాజేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్‌రావు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించాలని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆర్డీవో రాజేశ్వరావు సూచించారు. వేములవాడ రాజన్న ఆలయంలోని గెస్ట్‌హౌస్ సమావేశం మందిరంలో అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మార్చి 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, కల్యాణానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయ ఈవో వినోద్ రెడ్డి మాట్లాడుతూ రామనవమికి వచ్చే భక్తులకు మంచినీటి సరఫరా, క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్లు, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు నిర్వహిస్తున్నమని తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ వారికి సూచించారు. మజ్జిగా ప్యాకెట్లు, అరటి పండ్లు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ వీరప్రసాద్, డీఈ రఘునందన్, ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్ అధికారులు పాల్గొన్నారు.

'సూరమ్మ' కాలువల పనులు
కొనసాగేనా?



సూరమ్మ చెరువు

- పరిహారం పెంచాలని రైతుల డిమాండ్
- పరిహారం కింద రూ.10 కోట్లు విడుదల
- మరో రూ.70 కోట్లకు ప్రతిపాదనలు
- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు

కథలాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులకు ఈ ఏడాది కూడా గ్రహణం పట్టే పరిస్థితులే కనిపిస్తున్నాయి. వానా కాలం మరో రెండు మాసాల్లో ఆరంభం కానున్న నేపథ్యంలో పనులకు సమయం మించి పోతోంది. అధికార యంత్రాంగం హడావుడిగా నష్ట పరిహారం చెల్లింపు కోసం గ్రామ సభలు నిర్వహించగా పలు గ్రామాల రైతుల నుంచి కాలువల నిర్మాణంపై నిరాసక్తత వ్యక్తమైంది. తమకు కాలువలే వద్దని కొందరు ఖరాఖండిగా చెప్పగా, మరికొంత మంది పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పనుల కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి.



బీడు భూములకు సర్వే చేసి వేసిన హద్దులు

520 ఎకరాల భూములకు నష్టపరిహారం

సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 45 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరందించాలని అప్పటి బీఆర్ఎస్ సర్కారు కాలువల తవ్వకానికి రూ.204 కోట్లు కేటాయించింది. వెన్నా అనే కంపెనీ ఈ పనులను దక్కించుకుంది. ఆరేళ్ల కిందటే సదరు కంపెనీ ఇసుకను ఇప్పపల్లిలో నిల్వ చేసుకుని క్యాంపు ఏర్పాటు చేసుకుంది. అయితే భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తో నష్టపరిహారం కోసం రూ.10 కోట్లు విడుదల చేసి పబ్లిక్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అధికారులు గ్రామాల వారీగా భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సమావేశాల్లో కొన్ని గ్రామాల రైతులు తాము చిన్న, సన్నకారు రైతులమని సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని పేర్కొంటూ భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. మరి కొన్ని గ్రామాల్లో పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పనుల కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది. మరో రూ.70 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎకరానికి ప్రస్తుతం ఉన్న భూమి విలువ ప్రకారం చెల్లించాలని నిర్ణయించగా రైతుల నుంచి వచ్చే డిమాండ్లపై ఎలా స్పందిస్తార నేది వేచిచూడాలి.

ఈ కాలువల వల్ల కథలాపూర్ మండలంలోని కలికోటలో 48.31 ఎకరాలు, పోతారంలో 24.17, తాండ్ర్యాలలో 42.22, అంబారిపేటలో 73.03, దుంపెట 28.02, చింత కుంటలో 24.33, గంభీర్‌పూర్‌లో 50.04, ఇప్పపల్లిలో 39.11, పోసాని పేటలో 20.17 ఎకరాల చొప్పున రైతులు భూముల కోల్పోతున్నారు. మేడిపల్లి మండలంలోని దమ్మన్న పేటలో 05.06, భీమారంలో 22.18, మన్నెగూడెంలో 37.14, గోవిం దారంలో 104 ఎకరాల చొప్పున భూములకు నష్టం జరుగుతోంది. ఈ భూములకు పరిహారం కింద రూ.80 కోట్లు అవసర మని అధికారులు అంచనా వేశారు.



పరిహారం పెంచాలి
యాగండ్ల రమేశ్‌గౌడ్, దుంపెట

గౌడ సంఘం ఆధ్వర్యంలో 14 ఎకరాల్లో ఉపాధి కోసం ఈత చెట్లను పెంచుకున్నాం. మొక్కలు తెచ్చి డ్రిప్ ఏర్పాటు చేసుకుని అధిక వ్యయం చేసి పెంచుకున్నాం. కాలువలో దాదాపు 11 ఎకరాల భూమి కోల్పోతున్నాం. ఈత చెట్లనే నమ్ముకుని బతుకున్నాం. గుంటకు రూ.70 వేలు పరిహారం చెల్లించాలని వినతిపత్రం అందజేశాం.

ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక కవులు ముందుకు తీసుకెళ్లాలి

- సాహిత్యానికి ఆధ్యాత్మిక, కార్మిక క్షేత్రాలు పుట్టినిల్లులాంటివి
- కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్
- ఆధునిక సమాజంతో నడవకుంటే ఆగిపోవాల్సి వస్తుంది
- డాక్టర్ దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథం
- ఉత్సాహంగా ప్రారంభమైన రెండు రోజుల సాహిత్య జాతీయ సదస్సు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక కవులు ముందుకు తీసుకువెళ్లాలని, సాహిత్యానికి పుట్టినిళ్లుగా ఆధ్యాత్మిక, కార్మిక క్షేత్రాలైన వేములవాడ, సిరిసిల్లలు నిలుస్తున్నాయని కాళోజీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిరిసిల్ల మానేరు రచయితల సంఘం, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం సాహిత్య సమాలోచన రెండు రోజుల జాతీయ సదస్సును కవులు అందరు కలిసి జ్యోతిప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. సాయంత్రం డాక్టర్ నలిమెల భాస్కర్-సావిత్రి, జూకంటి జగన్నాథం-రమాదేవి దంపతులకు ఘనం గా ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం దూడం గణేష్ కవిత సంపుటి 'మాయ మైన మనిషి'ని ఆవిష్కరించారు. సదస్సులో నలిమెల భాస్కర్ మాట్లాడుతూ ఆధ్యా త్మిక, కార్మిక క్షేత్రాలైన సిరిసిల్ల, వేములవాడ గడ్డపైన ఎంతో మంది గొప్ప కవులు, రచయితలు వెలుగొందారన్నారు. తమ స్వగ్రామమైన నారాయణపూర్ నుంచి తనకు సాహిత్యం అబ్బిందని, కవులకు తమ ఊరు అప్పట్లోనే పెట్టిందిపేరన్నారు. పుస్త కాలను చూస్తే ఎంత ఉత్తేజం వస్తుందో.. పిల్లలను చూస్తే అంతే ఉత్తేజం వస్తుందని సూచించారు. ఒకప్పుడు మనుషులను చూసి రాళ్లు ఏడ్చేవని.. ప్రస్తుతం రాళ్లను చూసి మనుషులు ఎడుస్తున్నారన్నారు. ఇక్కడ రాళ్లను తీసుకువెళ్లి చైనాలో పడేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి మాటలు మాట్లాడితే అర్బన్ నక్సలైట్ అంటారని, సంప్రదాయ మాటలు మాట్లాడితే సంప్రదాయపు కవిగా ముద్రవేస్తారని వివరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం కవులు, రచయితలు

జూకంటి జగన్నాథం మాట్లాడుతూ సంపద సృష్టించబడిన చోట ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. మారుతున్న గ్లోబలైజేషన్‌తో పాటుగా నేటి యువత ప్రతి దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ లోకానికి సూర్యచంద్రులు ఎలాగో మనకు నలిమెల, జూకంటి ఇద్దరు అలాంటి వరని కొనియాడారు. దక్షిణ ప్రాంత ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ మానేరు, మూలవాగు పరివాహ ప్రాంతాల్లో ఎంతో మంది కవులు వెలుగొందారని గుర్తు చేశారు. సదస్సు కన్వీనర్, తెలుగు శాఖ అధ్యక్షురాలు శారద మాట్లాడుతూ ప్రాచీన కళలకు పెట్టింది పేరు ఈ ప్రాంతం అన్నారు. కవి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ భాషకు, కవిత్వానికి ఇద్దరు బ్రాండ్ అంబాసిడర్‌లు అని కొనియాడారు. ఈ సదస్సు సంచాలకులుగా అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్, సదస్సు సహ సంచాలకుడిగా డాక్టర్ సిరిసిల్ల చందన, సదస్సు కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షుడు కటుకం శారద, మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీ.వీ. నారాయణ, విమర్శకులు ఎం. నారాయణ శర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, కవులు, రచయితలు హాజరయ్యారు.

వేములవాడకు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



నిరంజన్‌కు స్వాగతం పలుకుతున్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ. నిరంజన్, బీసీ కమి షన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమల గిరి సురేందర్‌లు మంగళవారం రాత్రి వేములవాడ ఆలయానికి చేరుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. వారి వెంట ఆర్డీవో రాజేశ్వర్‌రావు, ఈవో వినోద్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఇల్లంతకుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని పయ్యావుల వైష్ణవి జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. వికారాబాద్‌లో జరిగిన 34వ రాష్ట్రస్థాయి పోటీలలో వైష్ణవి ఉత్త మ ప్రతిభ కనబర్చింది. ఈనెల 27నుంచి జాతీయస్థాయి పోటీలు బీహార్ రాష్ట్రంలో జరుగనున్నాయి. జాతీయస్థాయి పోటీల కు ఎంపిక కావడంపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మామిడి శ్రీనివాస్, సాన బాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గాదే స్వప్న, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

చొప్పదండి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలను సీబీఎస్ఈ మంగళవారం విడుదల చేసింది. గత జనవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది వేల మందికిపైగా విద్యార్థులు రాయగా, 80 మందిని ఎంపిక చేస్తూ జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందించనున్నట్లు చొప్పదండి నవోదయ ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. తొమ్మిదవ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. 14 మంది విద్యార్థులను ఎంపిక చేస్తూ జాబితాను ప్రకటించారు. వివరాలకు https:// cbseit.in/cbse/2025/nvs_result/Result.aspx వెబ్‌సైట్‌లోగాని విద్యాలయంలో గాని సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గుమ్లాపూర్ విద్యార్థిని ఎంపిక...

నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన పెరుమాండ్ల ప్రశస్తి ఎంపికయింది. ప్రశస్తిని సీఐ ప్రకాశ్, ఎస్ఐ సురేందర్ అభినందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు పదిహేను వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధి కారులు పర్య వేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి. కాగా రెండు రోజులుగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

బద్దిపోచమ్మకు బోనం మొక్కులు

ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలు పెట్టి ఒడి బియ్యం పోసి అమ్మవారిని దర్శించుకుని పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుంటూ కళ్లసాకతో మొక్కులు చెల్లించు కున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుం డా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చల్లని తాగునీరును భక్తులకు అందజేశారు. ఆలయ ఉద్యోగులు ఎప్పటికప్పుడు క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా చర్యలు తీసుకున్నారు.




రాజన్నను దర్శించుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న ఆలయ రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. స్వామివారి నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, పీఆర్వో శ్రీకాంతచారీలు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఐడియా అదిరింది..



మత్తడి నుంచి పైపుల ద్వారా దిగువకు వస్తున్న నీరు



కొడిమ్యాల వాగులో నీటి ప్రవాహం

- మైసమ్మ చెరువు మత్తడి వద్ద చేరిన నీరు
- పైపుల సహాయంతో దిగువకు తరలిస్తున్న రైతులు
- పెరిగిన భూగర్భ జలాలు

కొడిమ్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. వాగులు, వంకలు ఎండిపోయాయి. యాసంగి పంటలకు సాగు నీరందడం కష్టంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కొడిమ్యాల మండల రైతులు ఓ ఆలోచన చేసి ఎటువంటి విద్యుత్ మోటార్ లేకుండా పైపుల ద్వారా దిగువకు నీటిని మరలించి విజయం సాధించారు.

సొంత డబ్బులతో..

కొడిమ్యాల మైసమ్మ చెరువులో నీరున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి నుంచి నీరు దిగువకు వెళ్లి వాగులో సమృద్ధిగా పారుతుండేది. ఎండలు పెరిగిపోవడంతో మత్తడి పైనుంచి నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో వాగులో జలాలు పూర్తిగా ఎండిపోయాయి. సాగునీటికి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రైతులందరూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మత్తడి సమీపంలో నీరున్నా దిగువకు రాకపోవడంతో ఒక ఆలోచన చేశారు. రైతులు డబ్బులు జమ చేసి 40 పైపులు కొన్నారు. వాటిని ఎగువన ఉన్న మత్తడి వద్ద ఉన్న నీటిలో ఉంచి దిగువకు మరలించారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో ఎటువంటి మోటర్ సహాయం లేకుండా గ్రావిటీ ద్వారా నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో వాగు జలకళను సంతరించుకుంది. ఈ నీటితో కొడిమ్యాల, పూడూర్ పెద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలలో నీరు చేరింది. సుమారు 500 ఎకరాలకు నీరందింది. మైసమ్మ చెరువు నుంచి వాగుకి ఇరువైపుల వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగింది. చెక్‌డ్యాంలకు నీరు చేరడంతో తాము ఎదుర్కొన్న సాగు నీటి కష్టాలు తొలగిపోయాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలోనూ పశువులకు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి పైపులు వేసుకోవటానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, నీటిపారుదలశాఖ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



నీటితో కళకళలాడుతున్న చెక్‌డ్యాం

మామిడిలో జాగ్రత్తలు

- చింతల రోహిత్
ఉద్యాన అధికారి, చొప్పదండి



ఆంధ్రజ్యోతి: మామిడి తోటలో పూత, పిందె ఎందుకు రాలుతోంది?

అధికారి: వాతావరణంలో జరిగే అసాధారణ మార్పులే దీనికి ప్రధాన కారణం. వాతావరణాన్ని స్థిరీకరించుకోవడానికి మామిడి రైతులు ఉదయం సాయంత్రం రెండు గంటల చొప్పున నీరు పెట్టాలి. తేమ శాతం ఎల్లప్పుడూ ఉంటే మామిడితోటలో వాతావరణం స్థిరీకరణ జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: పూత, పిందె రాలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

అధికారి: పూత, పిందె రాలకుండా ఉండేందుకు రైతులు పది లీటర్ల నీటికి 10గ్రాముల జింకు సల్ఫేట్, 10గ్రాముల బోరాన్, 100 గ్రాముల పొటాషియం నైట్రేట్, 2మిల్లీమీటర్ల ప్లానోఫిక్స్‌ను పిచికారి చేయాలి.

ఆంధ్రజ్యోతి: కాయ దశలో ప్రధాన చీడపీడలు ఎలా ఉంటాయి?

అధికారి: కాయదశలో ఉన్న మామిడి తోటలో ప్రధానంగా నల్లి, పండు ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నల్లి ఉధృతిని నివారించడానికి లీటరు నీటికి 2మిల్లీలీటర్ల ప్రిపోనిల్, పండు ఈగ ఉధృతిని నివారించడానికి మలాతియాన్ లీటరు నీటికి 2మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేయాలి.

- చొప్పదండి

సునీల్‌రావుకు మేయర్ హోదా కల్పించిందే బీఆర్ఎస్

● బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్

కరీంనగర్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నీకు మేయర్ హోదా ఇచ్చిందే బీఆర్ఎస్ పార్టీ.. కేటీఆర్ దయాదాక్షిణ్యాలతోనే మేయర్ అయ్యావు.. ఖబర్దార్ సునీల్‌రావు బీఆర్ఎస్ పార్టీని, కేటీఆర్, గంగుల కమలాకర్‌ను విమర్శిస్తూ నోరు జారితే చూస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఊరుకోరు..నీ ఇంటిని ముట్టడించడమే కాకుండా కరీంనగర్‌లో తిరుగనివ్వమంటూ.. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తీవ్రస్థాయిలో మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావును హెచ్చరించారు. కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సిల్వర్‌జూబ్లీ సభ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీ రామారావుకు వేలాదిగా యువత తరలివచ్చి ఘనస్వాగతం పలకడం చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రేలాపణ చేస్తున్నారని ఖండించారు. మంగళవారం నగరంలోని బీఆర్ఎస్ నగరశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌ను విమర్శించే స్థాయి సునీల్‌రావుకు లేదని ఖండించారు. అధికారం కోసం బండి సంజయ్ దగ్గర మార్కులు వేయించుకునేందుకు ఆయన మెప్పు పొందే విధంగా పనిచేయాలేగానీ, గంగుల కమలాకర్‌ను, కేటీఆర్‌ను, బీఆర్ఎస్‌ను విమర్శిస్తే చూస్తూ ఊర్కోబోమని అన్నారు. ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు చేసి లబ్ధిపొందడం సునీల్‌రావుకు అలవాటని అన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే కరీంనగర్ అభివృద్ధి అయిందన్న విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించాలన్నారు. కేంద్రమంత్రి సంజయ్ దమ్ముకుంటే కాంగ్రెస్ ఆరుగ్యారంటీలపై మాట్లాడాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, యూత్ ప్రధాన కార్యదర్శి బొనకుర్తి సాయికృష్ణ, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, విద్యార్థి అధ్యక్షుడు బొంకూరి మోహన్, గంగాధర చందు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల

(5వ పేజీ తరువాయి)

ఏడు మండలాలు ఉండగా రెండు మండలాలు హన్మకొండ జిల్లాలో, రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో, మూడు మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. శాతవాహన యూనివర్సిటీలోనే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పితే విద్యార్థులకు అనువుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. జిల్లా కేంద్రంలో కళాశాల ఉంటే విద్యార్థులకు వసతి సౌకర్యం దొరకడం సులువవుతుంది. హుస్నాబాద్‌లో కళాశాల ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అక్కడ సీటు పొందే విద్యార్థులకు వసతి, రవాణా తదితర సమస్యలు ఎదురవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. యూనివర్సిటీలో 200 ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నది. విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు చేసే వీలుంటుంది.

● అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత

యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌లో ఏర్పాటు చేయడాన్ని విద్యార్థులు, జిల్లా ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ప్రభుత్వం మార్చుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో ఆరు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్న నేపథ్యంలో ఇక్కడే ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడుతున్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన శాసనసభ్యులు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీ ఆవరణలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. లేనిపక్షంలో తాము ఆందోళనబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.

స్వచ్ఛ కరీంనగర్ కోసం మహిళలు కృషి చేయాలి

● కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కరీంనగర్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్-2024లో కరీంనగర్ నగరపాలక సంస్థ మెరుగైన ర్యాంకు సాధించేందుకు మహిళలు కృషి చేయాలని కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ కోరారు. మంగళవారం ఆమె వావిలాలపల్లితోపాటు పలు డివిజన్లలో పర్యటించి సానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి తడి, పొడి చెత్త వేరు చేయడం, తడిచెత్తతో సేంద్రీయ ఎరువు తయారు చేయడం, పొడిచెత్తను డీఆర్‌సీసీ, ఆర్ఆర్ఆర్ సెంటర్లకు తరలించడం, స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రజాభిప్రాయ సేకరణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇళ్ళలోని చెత్తను ఇంట్లోనే వేరు చేసి తడిచెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసుకొని మొక్కలకు వేసి వాటిని పెంచాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేయకుంటే కార్మికులు ఆ చెత్తను తీసుకోరని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అభిప్రాయ సేకరణలో మహిళలు భాగస్వాములై కరీంనగర్ అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బుట్టి రాజారాం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, ఫార్మసీ స్టోర్‌లోని మందుల నిల్వలను, పేషంట్లకు పంపిణీ చేస్తున్న మందులను పరిశీలించారు. అలాగే సెంటర్‌లోని ల్యాబ్‌ను పరిశీలించారు. పరీక్షలు, జిల్లా ప్రధాన ఆసుపత్రికి పంపిస్తున్న శాంపిల్ వివరాలను, ఆన్‌లైన్‌లో రిపోర్టులను పరిశీలించారు. ఎన్‌సీడీలోని హైబీపీ, డయాబెటీస్ పేషంట్ల వివరాలు, వారికి అందుతున్న మందుల వివరాలు నమోదు తెలుసుకున్నారు. అనంతరం తీగలగుట్టపల్లిలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాన్ని, రికార్డులను తనిఖీ చేసి, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బుట్టి రాజారాం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సల్మా, తీగలగుట్టపల్లి బస్తీదవాఖానా వైద్యురాలు డాక్టర్ లావణ్య, ఎన్‌హెచ్‌ఎం డీపీవో స్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరాలు



తీగలగుట్టపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎస్సారార్ కళాశాలలోని వివిధ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిబిరాలు తీగలగుట్టపల్లి, నగునూరు, వల్లం పహాడ్ గ్రామాల్లో ఆదివారం ప్రారంభమయ్యాయి. తీగలగుట్టపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. నగునూరు, వల్లంపహాడ్‌లలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. కార్య క్రమంలో ఎస్సారార్ కాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె మురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుటారన్నారు. ఎన్ఎస్ఎస్ సలహా కమిటీ చైర్మన్ డాక్టర్ కె సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలన్నారు. అనంతరం వలంటీర్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత ఆరోపణలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ టౌన్ ఏసీపీకి మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ మంగళవారం ఫిర్యాదు చేశాడు. చేసేదేం లేక కేంద్ర మంత్రి చిల్లర మాటలతో కాలయాపన చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, చుక్క శ్రీనివాస్, బొంకూరి మోహన్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ పోరాటాలతోనే లా,ఇంజనీరింగ్ కళాశాల మంజూరు

గణేశ్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమ పోరాటాల ఫలితంగానే శాతవాహన యూనివర్సిటీకి అనుబంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్, లా కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేయాలని కోరారు.

రక్తదానం

సుభాష్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా రాష్ట్ర చిరంజీవి యువత పిలుపు మేరకు రామ్‌యవశక్తి, గాలిపెల్లి కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

గణేశ్‌నగర్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని డిమాండ్‌కు అనుగణంగా విద్యుత్ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు టీజీ ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్‌బాబు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా అందించడానికి 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్ఠం చేసినట్లు తెలిపారు. లోడ్ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు.

జీకే ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి స్మార్ట్ కిడ్స్ జీకే ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మంగళవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వినరేందర్‌రెడ్డి అభినందించారు.

'సాధన' శ్రీనివాస్‌రావుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అధినేత చింతపల్లి శ్రీనివాస్‌రావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. గడిచిన 21 సంవత్సరాలుగా సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ద్వారా సేవలందిస్తున్నారు. థీసిస్ సమర్పించడంతో కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు. శ్రీనివాస్‌రావును పలువురు విద్యావేత్తలు,పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు అభినందించారు,

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఏర్పాటు

కరీంనగర్‌రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా నగర నాయీబ్రాహ్మణ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, కార్యదర్శి జంపాల సంపత్, రాష్ట్ర అధ్యక్షుడు పొల్సాయి శ్రీనివాస్, కరీంనగర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పురమల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు పసువుల మోహన్, శివ, శ్రీహరి, నూతన కార్యవర్గ సభ్యులు ఔదుర్తి లక్ష్మణ్‌కుమార్, కంది వెంకటేష్, కంది రమేష్, సమ్మెట శ్రీను, జంపాల బిక్షపతి, సదానందం, కొండూరు అంబదాసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

గణేశ్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ అన్నారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాకు పూర్తిగా ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, మహేష్, శంకర్, దత్తు, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందన



శుభశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జపాన్-ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమానికి ఎంపికైన యువ ఆవిష్కర్త శుభశ్రీని మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. శుభశ్రీ పారమిత హెరిటేజ్ పాఠశాలలో చదివే సమయంలో రైతుల కోసం వినూత్న వ్యవసాయ యంత్రాన్ని రూపొందించారని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు తెలిపారు. జూన్ 15 నుంచి జపాన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

పంట నష్టపరిహారం అందించాలి

చొప్పదండి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షం ధాటికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని కాట్నపల్లి, మల్లన్నపల్లి, రుక్మాపూర్ గ్రామాల్లో దాదాపు 500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి 30 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మొగిలి మహేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కోటేష్, సింగిరెడ్డి భూమిరెడ్డి, నరసింహారెడ్డి, కిట్టుగౌడ్, పెద్ది వీరేశం, రాజారాం, జక్కుల అంజయ్య పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

హుజూరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాటం వల్లనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఆల్ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ్గుల ఓదెలు అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30ఏళ్ల సుదీర్ఘ అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు, రామచంద్రం, శేఖర్, అయిలయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వారసంత వేలం రెండోసారి వాయిదా

జమ్మికుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో రెండోసారి నిర్వహించిన వారసంత వేలం పాట వాయిదా పడింది. ఈ నెల 20న మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ సమక్షంలో మొదటిసారి వేలం పాట జరిపగా సరైన ధర రాకపోవడంతో 25వ తేదీకి వాయిదా వేశారు. మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటకు 22మంది గుత్తేదారులతో పాటు మహిళ సంఘం సభ్యులు, మొత్తం 23మంది హాజరుకావాల్సి ఉండగా కేవలం 9మంది మాత్రమే హాజరయ్యారు. సరైన కోరం లేదంటూ కమిషనర్ వేలం పాటను 27వ తేదీకి వాయిదా వేశారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



హుజూరాబాద్‌లో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూరాబాద్ లీగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఇజ్రాయిల్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, ఉపాధ్యక్షుడు బండి రమేష్, న్యాయవాదులు భగవాన్‌రెడ్డి, విజయరెడ్డి, ముక్కెర రాజు, శ్రీధర్‌బాబు, లక్ష్మణమూర్తి, బత్తుల తిరుపతి, విక్రమ్, ముచ్చ దివ్య, భానుకిరణ్, హరికిషన్, రాజేష్, అనిల్, రవి, కల్యాణ్, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్ల నిరసన



హుజూరాబాద్‌లో మానవహారం నిర్వహిస్తున్నర ఆశా వర్కర్లు

హుజూరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం ఆశావర్కర్లు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కొప్పుల శంకర్, ఆశవర్కర్లు లత, పుష్పలత, రమాదేవి, సుజాత, విజయలక్ష్మి, మదీన, ఉమ, సునీత, అరుణ, విమల, కవిత, సునీత, స్వరూప, శారద తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ఆశా కార్యకర్తలు ధర్నా, రాస్తారోకో చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆశావర్కర్లు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత, మండల అధ్యక్షురాలు నాగేల్లి పద్మ, కార్యదర్శి బోయిని ప్రియాంక, అంజలి, సరోజన, కవిత, శ్వేత, సునిత, పూజా, సాహిదబేగం తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండల కేంద్రంలో కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి ఆశాకార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై తిమ్మాపూర్ మండల ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఆశా వర్కర్ల యూని యన్ మండల అధ్యక్షురాలు రజిత, నాయకులు అనిత, పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల ముందస్తు అరెస్టు

శంకరపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం పోలీసులు వీవోఏలను మంగళవారం ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీవోఏలు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గన్నేరువరం: అసెంబ్లీ ముట్టడికి తరలి వెళ్ళకుండా మండలంలోని వివిధ గ్రామాల వీవోఏలను గన్నేరువరం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో వీవోఏల జిల్లా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్, ప్రధానకార్యదర్శి వడ్లకొండ పద్మ, వీవోఏలు ఉన్నారు.

మానకొండూర్: మండలంలోని సీఏలు అసెంబ్లీ ముట్టడికి తరలకుండా సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఏలను ముందు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిపై ఫిర్యాదు

చిగురుమామిడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిరాధారణమైన ఆరోపణలు చేశాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ఎస్సై బండి రాజేశ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు పెనుకుల తిరుపతి, మహంకాళి కొమురయ్య, బోయిన శ్రీనివాస్, నాగెళ్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాల కట్టడికి కృషి చేయాలి

హుజూరాబాద్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల కట్టడికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, సీడీపీవో సుగుణ, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో సతీష్‌కుమార్, ఏపీఎం తిరుపతి, ఏఎస్ఐ కమల తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: బాల్య వివాహలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తహసీల్దార్ బి రాజేశ్వరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పాఠశాల మానేసిన పిల్లలకు రేషన్ నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్ ప్రకాష్ అధ్యక్షతన బాలల పరిరక్షణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, ఎంఈవో హేమలత పాల్గొన్నారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన జేఏసీ నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జేఏసీ నాయకులు

తిమ్మాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహనీయులైన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముసుగు తొలగింపు విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణను హైదారాబాద్‌లోని వారి నివాసంలో జేఏసి నాయకులు కలిశారు. మండల కేంద్రంలో నెలకొల్పిన విగ్రహాలపై ముసుగులు తొలగించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరారు. అనంతరం అసెంబ్లీకి వెళ్లి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు విగ్రహాల ముసుగును తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ఉత్తరం రాసినట్లు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దుంద్ర రాజయ్య, మాతంగి శంకర్, జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, మేడి అంజయ్య, కొంకటి లక్ష్మీనారా యణ, ఎలుక అంజనేయులు, కనకం రాములు, సముద్రాల లక్ష్మణ్ ఉన్నారు.

● సంక్షిప్తం..

వీణవంక: మండల కేంద్రాములోని బస్టాండ్ ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో శ్రీధర్ ప్రారంభించారు.

- ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి డిమాండ్ చేశారు.
- మండల బీజేపీ శాఖ అధ్వర్యంలో చల్లూరులోని మజీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూడుపు సమ్మయ్య, పెద్ది మాల్లారెడ్డి, రామిడి ఆదిరెడ్డి, గడ్డం కుమారస్వామి, హరీష్, నవీన్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు బోయిని చిలుకమ్మ మరణించగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

- హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు రూ. 44.12 కోట్ల నిధులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంజూరు చేయించడంపై మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
- చిగురుమామిడి మండలంలోని నవాబుపేటలో వాగేశ్వరి మహిళ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన జాతీయ సేవా పథకం శిబిరాన్ని ఎస్సై బండి రాజేశ్ ప్రారంభించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన వడ్లూరి పోచయ్య అనే కార్మికుడికి ఆలయ ఫౌండేషన్ సౌజన్యంతో హైదాబాద్ శ్రీభగవాన్ మహావీర్ ట్రస్ట్ వారు జైపూర్ ఫుట్‌ను ఆందజేశారు.

గన్నేరువరం: తెలుగు వెలుగు సాహితీ వేదిక హుస్నాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పబ్బ జ్యోతిలక్ష్మి పురస్కారం అందుకున్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లెలో దళితబంధు యూనిట్లను ఎంపీడీవో పుల్లయ్య పరిశీలించారు.